క్లుప్తంగా

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ హరీష వ్యాధిని ఎలా గుర్తించాలి.. ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.. వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుశాంత్ జనా, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పాలకొండ రూరల్: ఎంపీడీఓగా ఎంవీ రంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఈయన పాలకొండకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన జి.ఉమామహేశ్వరికి కురుపాం బదిలీ కావడంతో ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి మురళి ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించారు. నూతన ఎంపీడీఓను సహచర ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్థల సేకరణ



స్థల సేకరణలో అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వంగర గ్రామంలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఐటీడీఏ అధికారులు గురువారం స్థల సేకరణ చేపట్టారు. గ్రామంలో 20 సెంట్ల స్థలం గుర్తించామని, త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామన్నారు. గ్రామస్తుల ఆరోగ్యమే లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు.

ఏజెన్సీలో వర్షం



పాలకొండ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నియోజకవర్గంలో మోస్తారు వర్షాలు పడుతున్నాయి. పాలకొండ పరిసరాల్లో గురువారం రోజంతా వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల పరిధిలోని వెలగవాడ, రుద్రిపేట, సింగన్నవలస, తదితర గ్రామాలకు చెందిన రైతులు తోటపల్లి కాలువల్లో ఇటీవల పూడికలు తీయడం.. ఈ సమయంలో వర్షం పడడంతో మెట్టు పంటలకు మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి



పలగరలో ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని, అందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, ప్రాథమిక విద్య వారి భవిష్యత్‌కు పునాది అని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలగర పంచాయతీ గుడివాడకాలనీలో గల ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థులతో చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్న

మక్కువ: ఆరుగాలం శ్రమించి, పండించిన పంట చేతికివచ్చే సమయంలో అకాల వర్షాలకు తడిచిపోవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట పక్వానికి చేరుకోగా..గడిచిన వారంరోజులుగా రైతులు మొక్కజొన్న కండెలను వేరుచేసి, కళ్లాలు, రహదారులు, కొండలపై ఆరబెట్టారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మొక్కజొన్న కండెలు తడిసిపోయాయి. తడిచిన మొక్కజొన్న కండెలను కొంతమంది రైతులు ట్రాక్టర్లపై ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా, మరికొంతమంది రహదారులపై ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు.



సర్వం డిజిటల్ మయం...

- ఏజెన్సీలో సైతం ఆన్‌లైన్ చెల్లింపులే
- చేతిలో సెల్ ఉంటే చాలు.. కొనుగోళ్లు సులభతరం

పాలకొండ రూరల్: సాంకేతికత పట్టణాలు దాటి పల్లెల్లోకి శరవేగంగా చొచ్చుకువస్తోంది. వినియోగదారుడి చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. డెబిట్, క్రెడిట్ కార్డులు లేకపోయినా ఫర్వాలేదు. చేతిలో సెల్‌ఫోన్ అందుబాటులో ఉంటే కావాల్సినవి కొనుక్కోవచ్చు. బడ్డీ కొట్టులో సింగిల్ టీ మొదలుకుని మాల్స్ వరకు.. మార్కెట్లో కూరగాయలు మొదలు జ్యూయలరీ దుకాణంలో బంగారం కొనుగోళ్ల వరకు డిజిటల్ పేమెంట్లే ఎక్కువగా జరుగుతున్నాయి. చేతిలో సెల్ ఉండి అందులో ఫోన్ పే, గూగుల్ పే, యోనో వంటి యాప్‌లు ఉంటే చాలు.. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా కొనుగోళ్లు చేసుకోవచ్చు.

ఏజెన్సీలో డిజిటల్ చెల్లింపులు...

నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లోనూ చివరకు తోపుడు బండ్లు. గంపలపై పండ్లు అమ్ముకునే చిన్న, చిన్న వ్యాపారులు కూడా ఫోన్ పే అంటున్నారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, తదితర థర్డ్‌పార్టీ యాప్ సాయంతో ప్రజలు ఆన్‌లైన్ లావాదేవీలను సులభంగా చేస్తున్నారు. తక్కువ పరిధిలో సురక్షితమైన చెల్లింపులు జరుగుతుండడంతో వీటికి ఆదరణ లభిస్తోంది. కిరాణా, నిత్యావసరాలు, పెట్రోల్, తదితర సామగ్రి మొదలుకుని మొబైల్, డీటీహెచ్, కేబుల్ రీచార్జ్‌లు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, రుణాల చెల్లింపులు, నగదు బదిలీలు, తదితర అవసరాలన్నింటికీ వీటినే ఉపయోగిస్తున్నారు. వారపు సంతల్లో కూడా ఆన్‌లైన్ పేమెంట్లు జోరందుకోవడం విశేషం.

చిల్లర సమస్యకు పరిష్కారం..

డిజిటల్ చెల్లింపుల ద్వారా చిల్లర సమస్యకు పరిష్కారం దొరికినట్లయింది. గతంలో పదో, పదిహేను రూపాయలో ఖర్చుచేసి చెల్లింపునకు రూ.వంద నోటు ఇస్తే చిల్లర ఇచ్చేందుకు దుకాణదారులు, వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఎక్కడ చూసినా యూపీఐ, ఫోన్‌పేల ద్వారా పేమెంట్ చేస్తుండడంతో అటు వినియోగదారుడికి, ఇటు వ్యాపారికి ఎటువంటి ఇబ్బంది లేనట్లయింది. దీంతో 70 శాతం మంది డిజిటల్ విధానంలో నగదు లావాదేవీలు చేపడుతున్నారు.

బ్యాంక్‌ల్లో కూడా...

బ్యాంక్‌ల్లో సైతం డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయి. ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా నేరుగా బ్యాంక్ నుంచే అవతలి వ్యక్తి ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. సగటున ఒక్కో బ్యాంక్ పరిధిలో రోజుకు రూ.8 లక్షల వరకు ఆన్‌లైన్ పేమెంట్లు జరుగుతున్నట్లు సంబంధిత బ్యాంక్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ క్రమంలో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.



రోడ్డుపక్క తినుబండారాల దుకాణం వద్ద డిజిటల్ పే చేస్తున్న వినియోగదారులు

చెల్లింపులు మరింత సులభం..



ఫోన్‌పేలు అందుబాటులోకి వచ్చిన క్రమంలో ఈ తరహా చెల్లింపులు అధికంగా జరుతున్నాయి. మాకు చిల్లర, చౌకబేరాల బెడద తగ్గింది. చేతితో నగదు తీసుకువెళ్లాల్సిన పనిలేదు. చెల్లింపుల్లో జవాబుదారీతనం ఉంది. వినియోగదారుకు, మాకు ఈ విధానం ఎంతో సులభతరం. అనవసర ఖర్చులు తగ్గాయి. క్యూర్‌కోడ్ ఉయోగించి చెల్లింపులు చేయడం తేలికైంది. – ముత్యాల పాపారావు, చేపల వ్యాపారి, పాలకొండ

జాగ్రత్తలు తప్పనిసరి..



డిజిటల్ చెల్లింపుల్లో అవసరమైన జగ్రత్తలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా సైబర్ నేరగాలపై చైతన్యవంతం కావాలి. ఫోన్ పే చెల్లింపుల సమయంలో సీక్రెట్ కోడ్ ఇతరులకు ఇవ్వరాదు. తెలియని వ్యక్తులు, బ్యాంక్ సిబ్బంది పేరిట వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదు. ఒకవేళ స్పందించినా ఓటీపీ నంబర్లు చెప్పకూడదు.

– కె.ప్రయోగమూర్తి, ఎస్సై, పాలకొండ

ఘనంగా వాల్మీకి జయంతి

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ప్రిన్సిపాల్ సుశాంత్ జనా, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

పాలకొండ రూరల్: రామాయణ మహా గ్రంథాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు డాక్టర్ సీహెచ్ రాఘవేంద్రరావు, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ కె.శ్రీనివాసరావు, పి.రాజ్యలక్ష్మి, పి.గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులంతా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన రాసిన రామాయణం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.రామయ్య పాల్గొన్నారు.



సీతంపేట: వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



పాలకొండ రూరల్: వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు



గుమ్మలక్ష్మీపురం: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఇంకుడుగుంతలతో ప్రయోజనం

భామిని : వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భ జలాలు పెంపొందించడానికి ఇంకుడుగుంతలు ఉపయోగపడతాయని ఎంపీడీఓ జి. చంద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి. రవినాయుడు అన్నారు. మండలంలోని నేరడి-బి, వడ్డంగి పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకుడుగుంతల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిసాబద్ర బాలయ్య, జామి భైరాగి, ఈఓఆర్డీ కె.కృష్ణారావు, ఏపీఓ ఈ.తులసీదాస్, కార్యదర్శి అనసూయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



నేరడి-బిలో భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ చంద్రరావు, సర్పంచ్ బాలయ్య

క్యాచ్‌అప్ రూల్ అన్యాయం

పాలకొండ రూరల్: రవాణా శాఖలో ఏఓ పోస్టుల పదోన్నతిలో క్యాచ్‌అప్ రూల్ అమలు చేయం రాజ్యాంగ విరుద్ధమని.. ఈ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని ఆ సంఘ నాయకుడు నూతలపాటి భరత్‌భూషణ్‌రాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్యాచ్‌అప్ రూల్ నిలిపివేయాలని సూచించారు. లేనిపక్షంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల ఉత్తరాంధ్ర ఫోరం నేతృత్వంలో పోరుబాట తప్పదన్నారు. సుప్రీమ్ కోర్టు ఉత్వర్వులు, జీఓలను తుంగలో తొక్కుతున్న రవాణ శాఖ జోన్-3 అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.



డిమాండ్ల పత్రాన్ని చూపిస్తున్న ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఫోరం సభ్యులు

అన్న క్యాంటీన్ ప్రారంభం

పాలకొండ : నగర పంచాయతీ పరిధిలోని కోటదుర్గమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

అవగాహన పెంచుకోవాలి

పాలకొండ రూరల్: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని లెప్రసీ వైద్య నిపుణుడు వి.ప్రసాదరావు అన్నారు.

గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు నేతృత్వంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదన్నారు. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తిస్తే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం యు.సునీత, ఆవర్కర్ ఎం.ధనలక్ష్మి, టి.పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



లెప్రసీపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు ప్రసాదరావు

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

గుమ్మలక్ష్మీపురం: భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దారు ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని గొడుగూడ గ్రామంలో గ్రామసభ గురువారం నిర్వహించారు. గతంలో జరిగిన భూముల రీసర్వేలో తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, ఒకరి పేరిట ఉన్న భూమి మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో చూపించడం వంటి సమస్యలు వచ్చినట్లు తెలిసిందన్నారు. గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శేఖర్

● ఘనంగా నందెన్న ఉత్సవాలు



పాలకొండ రూరల్: దేవరపేటలో పూజలందుకుంటున్న నందీశ్వరుడు

వాడవాడలా నందెన్న ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గౌరీపౌర్ణమి పురస్కరించుకుని, పార్వతీ సమేత పరమేశ్వరుని విగ్రహాన్ని మండపంలో ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

–పాలకొండ, కురుపాం



గురుగుబిల్లి: రావివలసలో పూజలందుకుంటున్న నందెన్న



భామిని: మండల కేంద్రంలో గౌరీపౌర్ణమి పూజలు



జియ్యమ్మవలస: బాసంగిలో నందెన్నకు పూజలు చేస్తున్న భక్తులు

మద్యం షాపు కేటాయింపుపై విచారణ

సీతంపేట: మండల కేంద్రంలో కె. అన్నపూర్ణ అనే వ్యక్తి లాటరీలో మద్యం షాపు దక్కించుకుంది. అయితే ఆమె ఏజెన్సీలో నివాసముండదని ఫిర్యాదు రావడంతో రెవెన్యూ సిబ్బంది గురువారం విచారణ చేపట్టారు. ఆర్ఐ వెంకటేష్, వీఆర్ఓ అలివేలు ముందుగా మండల రెవెన్యూ కార్యాలయంలో అన్నపూర్ణతో పాటు ఫిర్యాదుదారులను విచారించారు. అనంతరం హడ్డుబంగి గ్రామంలో సర్పంచ్ సవర సుమతి, ఉప సర్పంచ్ రాజరావు, వార్డు మెంబర్ రమణల నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆర్ఐ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



కొమరాడ పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో విజయ పార్వతి

● జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కె.విజయపార్వతి

కొమరాడ: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కె.విజయపార్వతి సూచించారు. మండలంలోని కూనేరు రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం సందర్శించిన ఆమె.. అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామస్తులు వాటి బారినపడకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే ఆస్పత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్యం అందించాలని తెలిపారు. గురుకుల విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి తులసీదళార్చన

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామిని తులశీదళాలతో గురువారం అర్చించారు. అలాగే భక్తులతో స్వామివారికి ముడుపుల పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి భక్తులు ప్రతి గురువారం తరలివస్తారని, ఈ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ముడుపుల పూజలు, అభిషేకాలు చేసినట్లు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజ



మక్కువ: స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి మాలధరించిన భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వేదపండితుడు ఆరవెల్లి విజయ్‌కుమార్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురుస్వామి కాళహస్తి శ్రీనివాసరావు సమక్షంలో, అయ్యప్ప భక్తులు భజన పాటలు పాడారు. పలు ప్రాంతాలనుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం రేపు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో ఈ నెల 19న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి 12 వరకు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయడంతో పాటు సూచనలు, సలహాలు తెలియజేయాలని కోరారు. 99592 25057 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.